ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.0

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 7 ఆగస్టు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	585.10 (297.7235)	3,72,073	3,54,618
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	370.08	370.08
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	157.47 (22.74)	3,71,605	1,08,895

చికెన్ ధరలు | లైవ్ : రూ.103 | డ్రెస్ : రూ.150 | స్కిన్‌లెస్ : రూ.170



సాగర్ 22 గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

వచ్చిన నీరు వచ్చినట్టే దిగువకు

సాగర్‌లో 22క్రస్ట్‌గేట్ల నుంచి నీటివిడుదల

నాగార్జునసాగర్, ఆగస్టు 6: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల ద్వారా ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుంచి వరద కొనసాగుతుండటం, ప్రాజెక్టులో నీటినిల్వలు గరిష్ఠ స్థాయికి చేరువగా ఉండటంతో మూడు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 26 క్రస్ట్‌గేట్లకు సోమవారం ఉదయం ఆరు క్రస్ట్‌గేట్ల ద్వారా మొదలైన నీటి విడుదల క్రమంగా గేట్ల సంఖ్యను పెంచుతూ మంగళవారం 22గేట్ల ద్వారా 3,08,264 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటిని, ప్రకృతి అందాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు సాగర్‌కు వస్తున్నారు. దీంతో సాగర్‌లో ఎక్కడ చూసినా పర్యాటకుల సందడి నెలకొంది.

•7లో..



సాగర్‌కు వచ్చిన పర్యాటకుల వాహనాలతో కిక్కిరిసిన రహదారి

‘పులిచింతల’కు 15 టీఎంసీలు

రెండేళ్ల తర్వాత జల విద్యుదుత్పత్తి



మేళ్లచెర్వు: పులిచింతల ప్రాజెక్టులో గంట గంటకూ నీటి నిల్వలు పెరుగుతున్నాయి. సోమవారం సాయంత్రానికి 131.88 అడుగులు (7.10 టీఎంసీలు) ఉండగా, మంగళవారం సాయంత్రానికి 157.47 అడుగులకు (22.74టీఎంసీలు) చేరింది. ఒక్క రోజులో 15 టీఎంసీలకు పైగా నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. ఈ క్రమంలో మంగళవారం ప్రాజెక్టు ఆరు రేడియల్ గేట్లను రెండున్నర మీటర్లు ఎత్తి 1,03,295 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు వద్ద ఎడమ వైపు ఉన్న తెలంగాణ జెన్‌కో పవర్ ప్రాజెక్టులో రెండేళ్ల తర్వాత విద్యుదుత్పత్తిని ప్రారంభించారు.

•7లో..

మూసీకి మరోసారి ఇన్‌ఫ్లో



కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు మరోసారి ఇన్‌ఫ్లో పెరిగింది. నాలుగు రోజులుగా ఇన్ ఫ్లో నిలిచిపోగా సోమవారం సాయంత్రానికి 54.74 క్యూసెక్కులుగా ఉండగా, మంగళవారం సాయంత్రానికి 370.08క్యూసెక్కులుగా నమోదైంది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం కాగా మంగళవారం సాయంత్రానికి 641.50 అడుగులుగా (3.57 టీఎంసీలు) ఉంది.

•7లో..

ఏఎమ్మార్పీ వరదకాల్వకు గండి



హాలియా, పెద్దఅడిశర్లపల్లి: నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఎలిమినేటి మాధవరెడ్డి వరద కాల్వకు సోమవారం రాత్రి గండిపడింది. మంగళవారం ఉదయం కాల్వ వైపు వెళ్లిన రైతులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. కాల్వ కట్టకు గండిపడటంతో అధికారులు అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద నీటి విడుదలను నిలిపివేశారు. ఇదిలా ఉండగా, ఏఎమ్మార్పీ నుంచి ఉదయసముద్రానికి 1,000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

•7లో..

బలహీనంగా కాల్వ కట్టలు



సాగర్ కాల్వలకు నీరు విడుదల చేయగా, కాల్వ కట్టల పటిష్ఠంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఏఎమ్మార్పీ వరద కాల్వకు గండిపడగా, సాగర్ ఎడమ ప్రధాన కాల్వ పటిష్ఠంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మూసీ మురిసేలా



» పర్యాటకం, ఆర్థికం, పర్యావరణం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు » వడివడిగా సిద్ధమవుతున్న డీపీఆర్
» సాగునీటి కాల్వల పునరుద్ధరణపై ఆశలు » ఇవి పూర్తయితే 60వేల ఎకరాలకు సాగునీరు

మూసీ సుందరీకరణ పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు డీపీఆర్‌లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. పర్యాటకం, ఆర్థికం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని మూసీ పరివాహకం వెంట పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అందులో భాగంగా మూసీ కాల్వల పునరుద్ధరణ చేపట్టే అవకాశం ఉంది. ఈ కాల్వల పనులు పూర్తయితే జిల్లాలో 60వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.
- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

మూసీ పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పన జోన్‌గా తీర్చిదిద్దనున్నట్టు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు, రూ.1,000కోట్లను అందుకు ఖర్చుచేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. పర్యాటకం, ఆర్థికం, పర్యావరణం ఈ మూడు కోణాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నారు. మొదటి దశలో భాగంగా ఉస్మాన్‌సాగర్ ప్రాజెక్టు డౌన్‌స్ట్రీం పాయింట్ నుంచి గౌరెల్లి సమీపంలోని అవుటర్ రింగ్‌రోడ్డు, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టు డౌన్‌స్ట్రీం పాయింట్ నుంచి బాపూఘాట్‌లో సంగమం పాయింట్ వరకు మూసీ నది వెంట పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అందుకు వేగంగా డీపీఆర్‌లు రూపొందుతున్నాయి. మూసీ పరివాహకంలో గ్రామీణప్రాంతాల్లో సాగునీటి వనరులను పునరుద్ధరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. జిల్లాలోని బీబీనగర్, భువనగిరి, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట మండలాల మీదుగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మూసీ ప్రవహిస్తోంది. మూసీ ఆధునికీకరణ ప్రాజెక్టు పూర్తయితే పరివాహక ప్రాంతమైన ఎగువన ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతోపాటు దిగువన ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో సాగునీటి వనరులు అభివృద్ధి చెందనున్నాయి.

చిన్న, మధ్యతరహా నీటి వనరులకు అధిక ప్రాధాన్యం

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అసంపూర్తిగా ఉన్న పిలాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగాని కాల్వల పునరుద్ధరణ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో చేపట్టే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

కాల్వల పునరుద్ధరణకు చర్యలు



బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత ప్రభుత్వం కాల్వల పునరుద్ధరణపై నిర్లక్ష్యం వహించింది. పనులు కొనసాగింపునకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రికి విన్నవించాం. మూడు కాల్వల పునరుద్ధరణకు సుమారు రూ.400కోట్ల మేర నిధులు అవసరమని అంచనా. మూసీ పరివాహక ప్రాంతంలోని సాగునీటి వనరులను పునరుద్ధరించి, రైతులకు సాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.
- కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

ఈ కాల్వలను 2014లో 60వేల ఎకరాలకు సాగునీరందించేందుకు డిజైన్ చేశారు. అందుకు రూ.284.85కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం 3మీటర్ల వెడల్పు ఉన్న కాల్వను 10మీటర్లుగా విస్తరించనున్నారు. ఇప్పటి వరకు కాల్వలు తవ్వారే తప్ప కల్వర్టులు నిర్మించలేదు. పనుల్లో జాప్యం కారణంగా కాంట్రాక్ట్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. అయితే కాంగ్రెస్ హయాంలో కాల్వల పునరుద్ధరణ పూర్తవుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

60వేల ఎకరాలకు సాగునీరు

పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వలను పునరుద్ధరించిన పక్షంలో జిల్లాతోపాటు, నల్లగొండ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో 60వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. గత ప్రభుత్వ అంచనాల ప్రకారం ఈ కాల్వల ద్వారా 50 క్యూసెక్కుల నీరు పారుతుండగా, 2016లో ప్రభుత్వం దాన్ని 200క్యూసెక్కుల పెంచాలనే లక్ష్యంతో డిజైన్ చేసింది. ధర్మారెడ్డి కాల్వను పునరుద్ధరిస్తే వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట, చిట్యాల, నకిరేకల్ మండలాల్లో చెరువులు, కుంటలు నిండి 17,500 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. పిల్లాయిపల్లి కాల్వ ద్వారా పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలంలోని 28 డిస్ట్రిబ్యూటరీ కాల్వలతో పాటు చెరువులు నిండుతాయి. దీంతో 23వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. బూనాదిగాని కాల్వ పూర్తయితే ఏడు మండలాల్లోని 33 చెరువులు నిండి, 20వేలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతుంది.


యాదగిరిక్షేత్రంలో శ్రావణ సందడి

నేటి నుంచి వరుస పర్వదినాలు

11న స్వాతి పూజలు, అఖండ దీపారాధన

భువనగిరి అర్బన్, నల్లగొండ కల్చరల్, ఆగస్టు 6: హరిహరులకు నెలవుగా విలసిల్లుతున్న యాదగిరిక్షేత్రంలో శ్రావణమాస సందడిలో భాగంగా విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 5న ప్రారంభమైన శ్రావణ మాసం వచ్చే నెల 3వ తేదీన ముగియనుంది. రెండో అన్నవరంగా ప్రాచుర్యం పొందిన ఇక్కడి ఆలయంలో ప్రత్యేకంగా కొండకింద నిర్మించిన వ్రత మండపంలో స్వామివారి భక్తులు సత్యదేవునికి సామూహిక వ్రతాలు నిర్వహించేందుకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఆలయంలో ఈ నెల 7వ తేదీన ఆండాళ్ అమ్మవారికి ఉదయం శేష ఆరాధన, సాయంత్రం పురప్పాట్ సేవ ఊరేగింపు, 8న నాగుల పంచమి, 9న గరుడ పంచమి వేడుకలు నిర్వహిస్తారు. 11వ తేదీన స్వామివారి జన్మనక్షత్రం రోజున స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో వేకువజామున శతఘటాభిషేకం చేపట్టనున్నారు. అదే రోజు ఆలయ తూర్పు రాజగోపురం ఎదురుగా భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు తగిన ఏర్పాట్లతో అఖండ (నిత్యంవెలిగే) దీపారాధనకు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 14 నుంచి 16 వరకు వార్షిక పవిత్రోత్సవాలతో పాటు చివరి రోజున వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తారు.

ప్రారంభమైన ముహూర్తాలు




హిందువులకు శ్రావణ మాసం అత్యంత పవిత్రమైన, ప్రత్యేకమైన నెల. చంద్రుడు శ్రవణానక్షత్రంలోకి ప్రవేశించినప్పటి నుంచి శ్రావణ మాసంగా పిలుస్తారు. శ్రీమహా విష్ణువు జన్మనక్షత్రం కూడా శ్రవణ నక్షత్రం కావడం తో ఈ మాసానికి ప్రత్యేకత ఉంది. ఈ మాసాన్ని విష్ణుమూర్తి, శివుడు, లక్ష్మీదేవికి ఇష్టమైన మాసంగా పరిగణిస్తారు. శ్రావణ మాసం ఈ నెల 5నుంచి మొదలుకాగా, సెప్టెంబరు 3తో ముగియనుంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెళ్లిళ్ల సందడి

శ్రావణ మాసం సోమవారం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెళ్లిళ్ల సందడి ప్రారంభమైంది. గురు, శుక్ర మూఢాల (మౌఢమి) వల్ల వరుసగా మూడు నెలలు వైశాఖం, జ్యేష్ఠం, ఆషాడం మాసాల్లో ఎలాంటి శుభ కార్యాలు నిర్వహించలేదు. పెళ్లిళ్లతో పాటు, గృహ నిర్మాణ ప్రారంభపూజలు, గృహ ప్రవేశాలు లాంటి శుభ కార్యాలు మూడు నెలలుగా నిలిచిపోయాయి. శ్రావణం తర్వాత వచ్చే భాద్రపద మాసంలోనూ వివాహ ముహూర్తాలు లేనందున ఈ నెలలోనే ఎక్కువగా వివాహాలు జరిగే అవకాశముందని పురోహితులు చెబుతున్నారు. వివాహాది శుభ కార్యాలపై ఆధారపడిన ఫంక్షన్ హాళ్లు, బ్యాండు, సన్నాయి మేళాలు, పురోహితులకు ఫుల్ గిరాకీ. ఈ నెల 8 నుంచి 28 వరకు పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, నూతన గృహ నిర్మాణ పూజలు నిర్వహించుకోవచ్చని పురోహితులు చెబుతున్నారు. వివాహాలకు ఈ నెల 8 నుంచి 11 వరకు, 15, 18, 22, 23, 28 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి.


28వ తేదీ వరకు శుభ ఘడియలు



ముహూర్తాలు మూడు నెలలుగా లేకపోవడంతో పెళ్లిళ్లు ఆగిపోయాయి. ఈ నెల 28వ తేదీ వరకు శుభఘడియలు ఉండటంతో ఎక్కువ మంది పెళ్లిళ్లు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఆగస్టు 28 తర్వాత మళ్లీ శుభ ముహూర్తాలు లేవు. ఈ నెల 9, 11, 18, 28 తేదీల్లో ఎక్కువ పెళ్లిళ్లు జరగనున్నాయి. కేవలం 10రోజులు మాత్రమే మంచి ముహూర్తాలు ఉన్నాయి.
రామలింగేశ్వరశర్మ, అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

‘స్వచ్ఛదనం-పచ్చదనం’ మెరుగ్గా నిర్వహించాలి

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 6: ‘స్వచ్ఛదనం-పచ్చదనం’ కార్యక్రమాన్ని ఇంకా మెరుగ్గా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా, మండలస్థాయి అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించాలని, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీపడవద్దన్నారు. పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించాలని, అన్ని మురుగు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా గుంతలన్నీ పూడ్చివేయాలని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, సంపదవనాలు, రహదారులకు ఇరువైపులా, పాఠశాలలు, అన్ని ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు నాటి నూరు శాతం లక్ష్యాన్ని చేరాలన్నారు. అన్ని పంచాయతీ, మునిసిపల్ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ పర్యవేక్షణ విధానాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఫ్రైడే డ్రైడేను నిర్వహించాలని, పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి సరఫరా, సంరక్షణపై దృష్టి సారించి ప్రతీ వెయ్యి జనాభాకు 10వ్యక్తిగత సోక్ పిట్లు, ఒక కమ్యూనిటీ సోక్ పిట్లను నిర్మించాలన్నారు. ఈ నెల 20 నాటికి వీటిని పూర్తి చేయాలని ఆదేశించారు. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా ప్రతీ డివిజన్‌కు ఒక యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, మూడు నెలల్లో జిల్లాలోని అన్ని కుక్కలకు స్టెరిలైజేషన్ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 16 పురాతన దేవాలయాలు, కట్టడాలను గుర్తించామని, ఉపాధి హామీ పథకం కింద వాటన్నింటినీ శుభ్రం చేయించాలన్నారు. అన్ని మునిసిపాలిటీల్లో ఈ నెల 15తర్వాత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నామని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పంచాయతీల్లో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకుండా అవగాహన కల్పించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఆర్డీవో నాగిరెడ్డి, డీపీవో మురళి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తి జయశంకర్

తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్వో డి.రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, ఈవో మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలానికి రానున్న సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్



తిమ్మాయిపాలెంలో రైతుల పొలాల్లో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 6: వివిధ రకాల భూసమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ పైలట్ ప్రాజెక్ట్ పనితీరును పరిశీలించేందుకు సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్ బుధవారం మండలానికి రానున్నారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ ఉన్నతాధికారులను కలిసి ప్రస్తుతం కృష్ణపట్టి ప్రాంతంలో నిర్వహిస్తున్న భూముల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ప్రధానంగా ప్రభుత్వ, ఫారెస్ట్, కాందిశీకుల, అటవీశాఖ భూముల సరిహద్దులు, భూ వివాదాల సర్వేను ఎలా నిర్వహించాలి, ఆయా భూముల సమస్యలు ఉన్న రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల మంజూరుపై అధికారులకు ఆయన సూచనలు చేయనున్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ, భూముల సర్వే

పైలట్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తున్న భూముల సర్వేను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్డీవో శ్రీనివాస్‌రావు మంగళవారం పర్యవేక్షించారు. చింతలపాలెం, తునికినూతల, నెల్లికల్, జమ్మనకోట గ్రామాల్లో రైతుల నుంచి తహసీల్దార్ల బృందం దరఖాస్తులను స్వీకరించింది. అనంతరం చింతలపాలెం రెవెన్యూ శివారులోని సర్వే నెం.162, తిమ్మాయిపాలెం రెవెన్యూ శివారులో సర్వే నెం.39లో, తునికినూతల శివారులోగల సర్వే నెం.45లో రైతుల కాస్తు కబ్జాను నిర్వహించేందుకు జీపీఎస్ ఆధారిత భూసర్వే నిర్వహించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్



నీటి సంపును పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్

దామరచర్ల, ఆగస్టు 6: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆశాడే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు వారికి సూచనలు అందించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించి దోమల బెడదను అరికట్టాలన్నారు. అనంతరం యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు నివాసం ఉంటున్న ప్రాంతాన్ని పరిశీలించి పారిశుధ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో గీతావాణి, జిల్లా మలేరియా నివారణ అధికారి దుర్గయ్యమండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

దేవరకొండ, ఆగస్టు 6: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండలో జరిగిన టీఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్య కార్మికులకు హామీలు ఇస్తున్నాయే తప్ప, వారికి న్యాయం చేయడంలేదన్నారు. దేశాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. కరోనాలాంటి భయంకర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పారిశుధ్య కార్మికులు పనిచేశారని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గతంలో పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగాడేగానీ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అరకొర జీతాలతో పారిశుధ్య కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్ట పెంజర రమేష్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్‌మాదిగ, దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పొట్ట మురళి, అందుగుల సైదులు, నర్సింహ, వెంకటయ్య, అచ్యుత్, గోవర్ధన్, మద్దిమడుగు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



పురప్పాట్ సేవలో అర్చకస్వాములు

భువనగిరి అర్బన్, ఆగస్టు 6 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ చెంత ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిజాభిషేకం,

స్వామివారికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణీ, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,49,164 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, తిరునక్షత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఉదయం తిరుమంజనం, స్నపనం నిర్వహించగా సాయంత్రం పురప్పాట్ సేవను నిర్వహించారు. ముఖ మండపంలో పారాయణీకులు దివ్యప్రబంధ పారాయణాలు, పాశురాలు పఠించారు. స్వామివారిని ప్రభుత్వ మాజీ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మహేందర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరించిన దొంగ అరెస్ట్

దేవరకొండ, ఆగస్టు 6 : అవ్వా మంచినీళ్లు ఇస్తావా..! అంటూ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 3వ తేదీన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో చోటుచేసుకోగా నిందితుడు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు మద్యం, పేకాటకు బానిసై కారులో తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 3న కొండభీమనపల్లికి చెందిన వృద్ధురాలు కనకటి లక్ష్మ మ్మ మెడలో నుంచి తులం బంగారు గొసులును అపహరించాడు. లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో అనుమానాస్పదంగా వెళ్తున్న ఆంజనేయులును పట్టుకొని విచారించగా వృద్ధురాలి గొలుసు చోరీ చేసినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. కారును సీజ్‌చేసి ఆంజనేయులు రిమాండ్‌కు తరలించడంతో పాటు అతడి వద్ద నుంచి తులం బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

నగదు అపహరణ కేసులో..

నేరేడుచర్ల, ఆగస్టు 6 : ట్రాక్టర్ డ్రైవర్‌ను కొట్టి నగదు అపహరించుకునిపోయిన ఇరువురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు వివరాలను వెల్లడించారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం అబంగాపురం గ్రామానికి చెందిన షేక్ సోహెల్ జూలై 31న ట్రాక్టర్‌పై నేరేడుచర్ల నుంచి పెన్‌పహాడ్ మండలం అనాజిపురం గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన సిద్దపంగ నరేష్, ఫత్తేపురం గ్రామానికి చెందిన సిద్దపంగు అజయ్‌కుమార్‌లు కారుతో ట్రాక్టర్‌ను అడ్డగించి అతడిపై దాడి చేసి సెల్‌ఫోన్‌ను పగులగొట్టి అతడి వద్ద ఉన్న రూ.20వేల నగదును అపహరించుకొని పోయారు. మంగళవారం పెంచికల్‌దిన్నకు వచ్చి నేరానికి ఉపయోగించిన కారును దాచిపెట్టి కల్లూరు గ్రామ శివారులో ఉన్నారు. సమాచారం అందడంతో వీరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. దొంగలించిన సొమ్ములో జల్సాలకు రూ.11వేలు ఖర్చుపెట్టగా వారి ఉద్ద మిగిలివున్న నగదు రూ.9వేలు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ రవీంద్రనాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బలహీనంగా సాగర్ కాల్వకట్టలు

● రూ.కోట్లు వెచ్చించినా నెరవేరని లక్ష్యం ● పూర్తి స్థాయిలో జరగని ఆధునికీకరణ పనులు ● ఆందోళనలో రైతులు

దాదాపు రెండేళ్ల తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద వస్తోంది. సమృద్ధిగా నీరుండటంతో గరిష్ఠ స్థాయిలో కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే ఎడమ కాల్వ కట్టలు బలహీనంగా ఉండి పలుచోట్ల కోతకు గురవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.వేల కోట్లు వెచ్చించి కాల్వలను ఆధునికీకరించామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా ఇంకా అనేక చోట్ల కాల్వకట్టలు బలహీనంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రాదం జరుగుతందోనన్న ఆందోళన రైతులో నెలకొంది.

నిడమనూరు / గరిడేపల్లి

ఎడమకాల్వ ఆయకట్టులో కాల్వల ఆధునికీకరణ పనులు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ముప్పారం, వేంపాడ్, ముకుందాపురం తదితర ప్రాంతాల్లో కాల్వకట్టలు అనేక చోట్ల దెబ్బతింటున్నాయి. ఆధునికీకరణ పనుల్లో భాగంగా కొంతమేర పటిష్టపర్చడంతో పాటు సీసీ లైనింగ్ పనులు చేశారు. కానీ గుత్తేదార్లు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేక చోట్ల సీసీ లైనింగ్ పనులు వదిలేశారు. పైగా పనుల్లోనూ నాణ్యత లోపించడంతో చేసిన పనులు కూడా కొద్దికాలానికే దెబ్బతింటున్నాయి. అక్కడక్కడ సీసీ లైనింగ్ చేయకుండా వదిలేసిన ప్రాంతాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. కాల్వలో నీటిప్రవాహఉధృతి పెరుగుతున్న క్రమంలో కోతకు గురయ్యే ప్రమాదం ఉందని లోతట్టు వాసులు ఆందోళన చెందుతున్నారు.

రెండేళ్ల కిందటి అనుభవంతో...

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో సాగర్ జలాశయం ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా వేగంగా పూర్తిస్థాయిలో నిండింది. పైగా మరింత వరద వచ్చి చేరుతున్నందున చెరువులను నింపేందుకు గరిష్ఠ స్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. దీనికి తోడు వర్షాలు కూడా కురుస్తున్నందున కాల్వకట్టల పరిస్థితిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వకట్టలపై అధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో రెండేళ్ల క్రితం 2022 సెప్టెంబరు 7న మండలంలోని ముప్పారం-వేంపాడ్ గ్రామాల నడుమ 32.109 కిలోమీటరు వద్ద సాగర్ ఎడమ కాల్వకట్ట తెగిపోవడంతో భారీగా నష్టం సంభవించింది. మూడు వారాల పాటు నీటి సరఫరా నిలిచిపోవడంతో అనేక గ్రామాల రైతులు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. వివిధ గ్రామాల రహదారులు, కల్వర్టులు కూడా దెబ్బతిన్నాయి. నిడమనూరు, నర్సింహులగూడెం గ్రామాల ప్రజలు వరద నీటిలోనే మూడు రోజులు గడపాల్సిన పరిస్థితి తలెత్తింది. కాల్వకు గండి పడటంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వలేదు. ఇకనైనా అధికారులు తగిన చర్యలు తీసుకొని కాల్వకట్టలపై నిరంతర పర్యవేక్షణ చేసి కాల్వకు గండ్లు పడకుండా చూడాలని రైతులు కోరుతున్నారు



గరిడేపల్లి మండలం వెలిదండ వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్ట

వెలిదండ వద్ద ప్రమాదపు అంచుల్లో..

సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని సూర్యాపేట జిల్లా గరిడపల్లి మండలంలో ప్రమాద అంచుల్లో కాల్వకట్టలు ఉన్నాయి. 2010-11లో కాల్వలకు సైడ్ వాల్ నిర్మించిన సమయంలో వెలిదండ దగ్గర కాల్వలోకి సిమెంట్, మట్టి, కంకర నీరు తదితరు సామాగ్రిని తీసుకెళ్లే వాహనాల కోసం అనువుగా కాల్వకట్టకు సుమారు 50 మీటర్ల మేర ర్యాంప్ వేశారు. కాల్వకట్టకు సైడ్ వాల్ నిర్మించడం పూర్తయి పదేళ్లు గడిచినా ఇంతవరకు ఆ ర్యాంపు వద్ద సైడ్‌వాల్ నిర్మాణం చేయలేదు. దీంతో కాల్వ కట్ట కోతకు గురై బలహీనంగా మారి ఏ క్షణాన గండి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వెలిదండతో పాటు కొత్తగూడెం గ్రామం దగ్గర కూడా సుమారు 10 మీటర్లు సైడ్‌వాల్‌కు లైనింగ్ చేపట్టలేదు. పదేళ్లుగా ఎన్ఎస్‌పీ అధికారులు దాని గురించి పట్టించుకోలేదు. కాల్వకట్ట దుస్థితిపై రైతులు, గ్రామస్తులు ఎన్ఎస్‌పీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా కాలం వెల్లబుచ్చారే తప్ప చర్యలు తీసుకోలేదు. కాల్వకు భారీ మొత్తంలో నీరు వదులుతున్న ప్రస్తుత తరుణంలో రైతులు ఏక్షణమైనా గండిపడే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

> **కాల్వ లైనింగ్ చేపట్టాలి**
>
> 
>
> కాల్వ ఆధునికీకరణ పనుల సమయంలో ర్యాంప్ కోసం వదిలిన ప్రాంతం కోతకు గురైంది. ప్రస్తుతం నీటిని వదులుతున్న సమయంలో ఎప్పుడు తెగుతుందో తెలియని పరిస్థితి. లైనింగ్ నిర్మించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు త్వరగా చర్యలు చేపట్టాలి.
>
> - ఆదూరి కోటయ్య, వెలిదండ గ్రామ రైతు

ఎడమకాల్వ గండ్లకు మరమ్మతులు

నడిగూడెం : నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల ముందే కాల్వకట్టలకు గండ్లకు సూర్యాపేట జిల్లా నడిగూడెంలో మరమ్మతులు చేశారు. మంగళవారం మండలంలోని రామాపురం వద్ద ఇటీవల ఏర్పడిన గండిని రూ.18 లక్షలతో పూడ్చివేశారు. ఎడమ కాల్వకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా కాల్వ కట్టలు బలహీనంగా ఉండడం షట్టర్లు, తూములు, మేజర్, మైనర్ కాల్వలు పూడిక పనులను చేపట్టే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. గతంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకొని ఎన్ఎస్పీ అధికారులు కాల్వపై నిఘా పటిష్ఠ శారు.

రెండు రోజుల్లో పరిశీలిస్తాం

వెలిదండ వద్ద కాల్వ కట్ట కోతకు గురైనట్లు రైతులు తమ దృష్టికి తెచ్చింది వాస్తవమే. అయితే గుత్తేదారు పనులు చేయాల్సి ఉండే చేపట్టలేదు. ఒకటి రెండు రోజుల్లో కాల్వ పరిస్థితి పరిశీలిస్తాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం

- రఘు, ఎనెన్పీసీ డీఈ

వచ్చిన నీరు వచ్చినట్టే దిగువకు

సాగర్‌లో 22క్రస్ట్‌గేట్ల నుంచి నీటివిడుదల



నాగార్జునసాగర్ / మేళ్ల చెర్వు/ హాలియా / కేతేపల్లి, ఆగస్టు 6: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల ద్వారా ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుంచి వరద కొనసాగుతుండటం, ప్రాజెక్టులో నీటినిల్వలు గరిష్ఠ స్థాయికి చేరుకవగా ఉండటంతో మూడు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 26 క్రస్ట్‌గేట్లకు గాను సోమవారం ఉదయం ఆరు క్రస్ట్‌గేట్ల ద్వారా మొదలైన నీటి విడుదల క్రమంగా గేట్ల సంఖ్యను పెంచుతూ మంగళవారం 22గేట్ల ద్వారా 3,08,264 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టులన్నీ నిండటంతో గేట్లన్ని ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

ఆగని వరద రాక

సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885(312.5050టీఎంసీలు)అడుగులు కాగా మంగళవారం రాత్రికి 883.20అడుగులకు (205.6627 టీఎంసీలు) చేరింది. ఎగువనుంచి 3,71,073 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో క్రస్ట్‌గేట్ల నుంచి, కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల నుంచి శ్రీశైలం నుంచి సాగర్‌కు 3,72,073 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590అడుగులు(312.5050టీఎంసీలు) కాగా మంగళవారం రాత్రికి 585.10 అడుగులకు (297.7235 టీఎంసీలు) చేరుకుంది. ప్రాజెక్టు 22 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,08,264 క్యూసెక్కులు, సాగర్ కుడి కాల్వ ద్వారా 8,144 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,217 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, 22 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,08,264 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 3,54,618 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువనుంచి 3,72,073 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. అనుముల మండలం మారేపల్లి వద్ద వరద కాల్వ కట్ట తెగిపోవడంతో వరద కాల్వకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటిని, ప్రకృతి అందాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు సాగర్‌కు వస్తున్నారు. 22 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటం ఆ ప్రాంతంలో పాలపొంగులా నీటి దొంతరలు ప్రాజెక్టు పరిసరాలను కనువిందు చేస్తున్నాయి. దీంతో సాగర్‌ను అందాలను సందర్శించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో సాగర్‌లో ఎక్కడ చూసినా పర్యాటకుల సందడి నెలకొంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో పర్యాటకుల రద్దీ మరింత ఎక్కువగా ఉంది. కొత్తవంతెనపై భారీగా ట్రాఫిక్ జాం అవుతోంది. దీంతో సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్‌లు తమ సిబ్బందితో రాకపోకలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పునరుద్ధరిస్తున్నారు.

'పులిచింతల'కు ఒక్క రోజులో 15 టీఎంసీలు

రెండేళ్ల తర్వాత ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని పులిచింతల ప్రాజెక్టులో నీటి సవ్వడులు వినిపిస్తున్నాయి. సోమవారం సాయంత్రానికి 131.88 అడుగులు(7.10 టీఎంసీలు) ఉండగా, మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు 157.47అడుగులకు(22.74టీఎంసీలు) చేరింది. ఒక్క రోజులో 15 టీఎంసీలకు పైగా నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. అదేవిధంగా ప్రాజెక్టు సగానికి నీటినిల్వలు చేరుకున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు(45.77 టీఎంసీలు)కాగా ప్రస్తుతం 157.47అడుగులకు(22.74టీఎంసీలు) చేరింది. సాగర్ నుంచి 3,71,605 క్యూసెక్కుల వరద ఎగువ నుంచి వస్తోంది.

ఆరు రేడియల్ గేట్ల ఎత్తివేత

ప్రాజెక్టులో సగానికి నీటినిల్వలు చేరుకోవడంతో పాటు ఎగువన సాగర్ ప్రాజెక్టు వద్ద 22 క్రస్ట్‌గేట్లు ఎత్తడంతో పాటు విద్యుదుత్పత్తి ద్వారా లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయానికి ప్రాజెక్టు పూర్తిగా నిండే అవకాశం ఉందని అధికారులు అంచనాలో ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం ప్రాజెక్టు ఆరు రేడియల్ గేట్లను రెండున్నర మీటర్లు ఎత్తి 1,03,295 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రెండేళ్ల తర్వాత జల విద్యుదుత్పత్తి

పులిచింతల ప్రాజెక్టు వద్ద ఎడమ వైపు ఉన్న తెలంగాణ జెన్‌కో పవర్ ప్రాజెక్టులో రెండేళ్ల తర్వాత విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రాజెక్టులో నీటి నిల్వలు 10 టీఎంసీలకు చేరుకోగానే 3600 క్యూసెక్కులతో విద్యుదుత్పత్తిని ప్రారంభించామని జెన్‌కో ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 5,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ రెండు యూనిట్ల ద్వారా 40 మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేస్తున్నట్లు తెలిపారు.

మూసీకి మరోసారి ఇన్‌ఫ్లో

మూసీ ప్రాజెక్టుకు మరోసారి ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు రోజులుగా ఇన్‌ఫ్లో నిలిచిపోగా సోమవారం రాత్రి నుంచి మూసీ ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో మంగళవారం స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చింది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి 54.74 క్యూసెక్కులుగా ఉండగా మంగళవారం సాయంత్రానికి 370.08క్యూసెక్కులుగా నమోదైంది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం కాగా మంగళవారం సాయంత్రానికి 641.50 అడుగులుగా (3.57 టీఎంసీలు) ఉంది.

ఏఎమ్మార్పీ వరదకాల్వకు గండి

హాలియా, ఆగస్టు 6 : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని ఎలిమినేటి మాధవరెడ్డి వరదకాల్వకు సోమవారం రాత్రి గండిపడింది. మంగళవారం ఉదయం కాల్వ వైపు వెళ్లిన రైతులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ఈ నెల 2వ తేదీన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వకు నీటిని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు విడుదల చేశారు. అక్కడినుంచి నీరంతా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(ఏఎమ్మార్పీ) ప్రాజెక్టు చేరుకుంటుంది. ఆ తర్వాత ఎలిమినేటి వరద కాల్వకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 1,800 క్యూసెక్కుల మేర నీటి ప్రవాహం కొనసాగుతుండగా అనుముల మండలం మారేపల్లి శివారు 36వ కిలోమీటర్ వద్ద గండి పడింది. ఆ ప్రాంతంలో కాల్వ లోతుగా ఉండటంతో పాటు కాల్వ పక్కకు వర్రెలు(జాలు నీరువెళ్లే పిల్లకాల్వ) ఉండటంతో పంట పొలాలకు ముప్పుతప్పింది. కాల్వ కట్టకు గండిపడటంతో అధికారులు అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద నీటి విడుదలను నిలిపివేశారు. కాల్వలో ఉన్న నీరు హాలియా వాగులోకి వెళ్తోంది. కాల్వలో కంప చెట్లు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడం, కట్ట కుంగడం గండిపడటానికి కారణంగా భావిస్తున్నారు. నీరు పూర్తిగా ఖాళీ అవడానికి సుమారు 18గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. గండిపడిన ప్రాంతానికి హాలియా వాగు సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉండగా నీరు వాగులోకి చేరడానికి మూడు గంటలు పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

గండి పూడిక పనులు ప్రారంభిస్తాం

వరదకాల్వకు గండిపడిన ప్రాంతాన్ని ఎన్ఎస్పీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వర్‌రావు, ఈఈఎస్ సత్యనారాయణ, ఏఈ మల్లయ్యలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండి సమాచారం తెలియగానే వరద కాల్వకు నీటిని నిలిపివేశామన్నారు. నీటిప్రవాహం తగ్గడానికి సుమారు 18 గంటలు పడుతుందన్నారు. బుధవారం ఉదయం నాటికి కాల్వలో నీరు ఖాళీ అవుతుందని, పనులను ప్రారంభించి వెంటనే పూర్తి చేస్తామన్నారు. పనుల పూర్తికి రెండు రోజులు పట్టవచ్చని వారు తెలిపారు. అనుముల మండల వ్యవసాయాధికారి సరిత గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి, ఎలాంటి పంట నష్టం జరగలేదన్నారు.



గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్ఎస్పీ అధికారులు

> **రైతులే ఖర్చులు భరించి..**
>
> నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుకు నీరు విడదల చేశారు. గత ఏడాది క్రాప్ హాలిడే ఉండడంతో కాల్వలపై పర్యవేక్షణ కరువైంది. దీంతో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి మేజర్లు, మైనర్ కాల్వల్లో విపరీతంగా పెరిగాయి. దీంతో కాల్వలో నీరు ప్రవాహం తగ్గే అవకాశం ఉండటంతో రైతులు సొంత డబ్బులతో ఎక్స్‌కవేటర్లను ఉపయోగించి మైనర్ కాల్వలను శుభ్రం చేయించారు.

ఉమ్మడి జిల్లాలో ముసురు

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)/ నల్లగొండ / సూర్యాపేట టౌన్ / ఆగస్టు 6: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం ముసురు కురిసింది. నల్లగొండ జిల్లాలో 10.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కట్టంగూరు మండలంలో అత్యధికంగా 5.6 సెంటీమీటర్లు, అత్యల్పంగా త్రిపురారం మండలంలో 1.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యాదాద్రిభువనగిరి జిల్లాలో సగటున 0.9మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, అత్యధికంగా పోచంపల్లిలో 4.4మిల్లీమీటర్లు, అత్యల్పంగా మోత్కూరులో 0.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లాలో రోజంతా ముసురు కురియగా 22.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నూతనకల్ మండలంలో 4.7సెంటీమీటర్లు, అత్యల్పంగా తిరుమలగిరి మండలంలో 5.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉమ్మడి జిల్లాలో ముసురుతో కూడిన వర్షంతో పత్తి పంటలకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు తెలిపారు.

ఉద్యోగం రావడం లేదని యువతి ఆత్మహత్య

నల్లగొండ క్రైం, ఆగస్టు 6: ఉన్నత చదువులు చదివినా ఉద్యోగం రావడం లేదని మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో ఈ సంఘటన జరిగింది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన నాగవెల్లి మౌనిక(29) బీఈడీ చదివింది. నాలుగైదేళ్లుగా పానగల్‌కు చెందిన మేనమామ కాపర్తి పిచ్చయ్య ఇంట్లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. ఇటీవల నిర్వహించిన ఎస్ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించింది. చివరి దశ(మెయిన్స్) రాత పరీక్షలు క్వాలిఫై కాలేదు. డీఎస్సీ పరీక్ష కూడా రాసింది. కొద్ది రోజులుగా మౌనిక గ్రూప్స్, పాటు వివిధ పోటీ పరీక్షలకు కూడా సన్నద్ధమవుతోంది. ఎన్ని పరీక్షలు రాసినా ఉద్యోగం రావడం లేదని మనస్తాపం చెందిన ఆమె మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మేనమామ పిచ్చయ్య ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గమనించి చూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.మౌనిక తల్లి నాగవెల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకుని యువకుడు..



మల్లేష్(ఫైల్)

చింతపల్లి, ఆగస్టు 6 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తీదెడే(వెంకటంపేట) గ్రామానికి చెందిన గునమోని వెంకటమ్మకు ముగ్గురు సంతానం.మొదటి కుమారుడికి వివాహం కావడంతో ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. రెండో కుమారుడు మల్లేష్(28) వివాహం కాలేదు. గ్రామంలోనే వేరే ఇంట్లో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. సాయంత్రం ఇంట్లోకి వెళ్లిన స్థానికులు చూసే సమయానికి మృతి చెందాడు. విషయాన్ని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ యాదయ్య తెలిపారు.

ఎలుకల నివారణ మందు తిని 15 నాటుకోళ్లు మృతి

భువనగిరి రూరల్, ఆగస్టు 6: వరి చేనులో ఎలుకల నివారణ మందు కలిపిన బియ్యం తిని 15 నాటుకోళ్లు మృతి చెందాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం ఆకుతోటబావితండాలో మంగళవారం వరిచేనులో జరిగింది. తండాకు చెందిన కేతావత్ రవికి సంబంధించిన 15 నాటుకోళ్లు రోజువారి మాదిరే బహిరంగ ప్రదేశాల్లో ఆహారం కోసం వెళ్లాయి. అయితే అదే తండాకు చెందిన కేతావత్ రాములు ఎలుకల బెడదను నివారించేందుకు తన వరి చేనులో ఎలుకల మందు కలిపిన బియ్యం పొలంగట్టుపై పెట్టాడు. ఈ క్రమంలో ఆ బియ్యాన్ని తిన్న 15నాటుకోళ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మందు కలిపిన బియ్యం పెడుతున్నట్లు తమకు ముందస్తుగా సమాచారం ఇవ్వలేదని పేర్కొంటూ బాధితుడు రవి రైతు భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రాములపై ఫిర్యాదుచేశాడు. ఈ ఫిర్యాదుపై ఎస్ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ చనిపోయిన కోళ్లకు వెటర్నరీ డాక్టర్‌తో పోస్టుమార్టం జరిపించామని, నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో చికిత్స పొందుతూ ముగ్గురి మృతి



ఎల్లయ్య(ఫైల్)

తిప్పర్తి, ఆగస్టు 6 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన రేషన్ డీలర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో జరిగింది. ఎస్ఐ డీ రాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కంకణాలపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ గంటెకంపు ఎల్లయ్య(50) జూలై 26న బైక్‌పై తిప్పర్తి నుంచి కంకణాలపల్లి వెళ్తుండగా అనిశెట్టిదుప్పలపల్లి గ్రామ శివారులో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఎల్లయ్యకు భార్యతో పాటు కుమార్తె ఉన్నారు.

కట్టంగూరు: నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అంజీపురం గ్రామానికి చెందిన అనుముల భిక్షం(55) కట్టంగూరు మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి ఈనెల 3న మోపెడ్‌పై వెళ్తున్నాడు. పిట్టంపల్లి గ్రామశివారులో చెరువు అలుగు వద్ద వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ప్రమాదంలో భిక్షంకు బలమైన గాయాలయ్యాయి. అదేరోజు చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఈ నెల 5న రాత్రి మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. భిక్షం భార్య పూలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ కూలీ..

భువనగిరి రూరల్, ఆగస్టు 6 : పత్తి చేలకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లాలో మంగళవారం జరిగింది. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం అంధులగూడెం గ్రామానికి చెందిన కోరాతే తిరుపతి(36), భార్య శశికళ, ముగ్గురు పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం ఆరు నెలల కొందట యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవెల్లికి వచ్చాడు. స్థానిక పోలిశెట్టి ప్రవీణ్ వ్యవసాయ క్షేత్రంలో పనిలో చేరాడు. ఈ నెల 4న క్షేత్రంలోని పత్తి చేలలో క్రిమిసంహారక ముందు పిచికారీ చేస్తున్నాడు. కొద్దిసేపటి తర్వాత తిరుపతి వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆయన్ను భువనగిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. మూడురోజుల పాటు చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు తిరుపతి తమ్ముడు ప్రేమ్‌సాగర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెళ్లి ప్రస్తావన చేయడంతో దివ్యాంగురాలి హత్య

సూర్యాపేట రూరల్, ఆగస్టు 6 : దివ్యాంగురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. పెళ్లి చేసుకోమని నిలదీయడంతో ప్రియుడే హత్య చేశాడు. తొమ్మిదేళ్లుగా ప్రేమపేరుతో నమ్మించిన ప్రియుడే దారుణానికి ఒడిగట్టాడు. హత్యకు సంబంధించిన వివరాలను మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో డీఎస్పీ రవి సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట మండలం జాటోతుతండాకు చెందిన ధరావత్ లాక్యా, లాడీలకు తొమ్మిదిమంది సంతానం కాగా అందులో ఆరుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆరుగురిలో చిన్నకుమార్తె రమ(37) పుట్టుకతోనే దివ్యాంగురాలు(కాలుకు పోలియో). 30 ఏళ్ల కిందటే తల్లితండ్రులు అనారోగ్యంతో చనిపోయారు. రమకు వివాహం కాలేదు. ముగ్గురు అన్నలు తండాలో ఉన్నప్పటికీ పదేళ్ల నుంచి ఒంటరిగానే ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛన్‌తో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో అదేతండాకు చెందిన జాటోతు నరేందర్ అలియాస్ నరేష్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి తొమ్మిదేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. కాగా ఇటీవల నరేష్‌ను రమ పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. అందుకు అతడు నిరాకరించాడు. దివ్యాంగురాలివి నిన్ను నేను పెళ్లి చేసుకోనంటూ చెబుతున్నాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవలు మూడేళ్లుగా జరుగుతున్నాయి. గతేడాది నరేష్ తన వద్ద డబ్బులతో పాటు చెవిదిద్దులు కూడా తీసుకున్నాడని తండాలో పెద్దమనుషుల వద్ద రమ పంచాయితీ పెట్టింది. అయితే పెద్దమనుషులు రమకు నరేష్ రూ.40 వేలు ఇవ్వాలని, ఒకరికొకరు మాట్లాడుకకోవద్దని తీర్మానించారు. వెంటనే తీర్మానం మేరకు రూ.40 వేలను నరేష్ పెద్దమనుషుల సమక్షంలో రమకు ఇచ్చారు. అప్పటి నుంచి నరేష్ పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. ఆ సంబంధాలను రమ చెడగొడుతోంది. దీంతో రమ ఆర్థికంగా నష్టం కలిగించడమే కాక పెళ్లి సంబంధాలు చెడగొడుతుందని నరేష్ కోపంతో ఉన్నాడు. రమ బతికి ఉంటే తనకు పెళ్లి కాదని ఎలాగైనా తనను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 2న శుక్రవారం అర్ధరాత్రి రమా ఇంటికి వెళ్లి ఇంటి వెనకాలా దాచుకున్నాడు. రమ మూత్రవిసర్జనకు ఇంట్లోంచి బయటకిరావడంతో నరేష్ వెంటనే వెళ్లి చెంపపై కొట్టడంతో కిందపడిపోయింది. వెంటనే ముఖంపై కాలుతో బలంగా తన్ని గొంతు నులమడంతో రమ అక్కడికక్కడే మృతి చెందింది. మరుసటి ఉదయం ఆమె రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన తండావాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన చెల్లెలు మృతిపై జాటోతు నరేందర్‌పై అనుమానాలున్నట్లు రమ సోదరుడు ధరావత్ కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు కొనసాగించారు. ఆ రోజు నుంచి పరారీలో ఉన్న నరేందర్‌ను మంగళవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ తెలిపారు. విచారణ అనంతరం రమను హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్, సిబ్బంది ఇరుగు బాబు, యాదగిరి, అజ్గర్‌హలీ, ఉమా మహేష్, రమేష్ పాల్గొన్నారు.

వేర్వేరుచోట్ల రేషన్ బియ్యం పట్టివేత

హాలియా, ఆగస్టు 6 : అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా హాలియా పట్టణ పరిధి అనుములలో సోమవారం రాత్రి సీజ్ చేశారు. అనుములకు చెందిన డీలర్ సైదులు రేషన్ బియ్యాన్ని అదే గ్రామంలో దండెం మహేష్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేశాడని సమాచారం మేరకు పెద్దవూర డీటీసీఎస్ మక్తార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 20క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యం డీటీసీఎస్ తెఎలిపారు. డీలర్‌తో పాటు మహేష్‌పై కేసు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఆర్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటోల తరలిస్తుండగా ..

చండూరు రూరల్ : నల్లగొండ జిల్లా చండూరు మండలం గుండ్రపల్లి గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం ఆటోలో తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చండూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం గుండ్రపల్లి గ్రామ పరిధిలో పోలీసు సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. గుండ్రపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరం వెంకన్న వాహనంలో 12 క్వింటాళ్ల(24 బస్తాలు) రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా గుర్తించారు. విచారణ అనంతరం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. తనిఖీలో ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



నాగునాయక్(ఫైల్)

సూర్యాపేట రూరల్, ఆగస్టు 6 : విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం బోజ్యాతండాలో జరిగింది. ఎస్ఐ బాలునాయక్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మండలం జాటోతుతండా ఆవాసప్రాంతం బోజ్యాతండాకు చెందిన వాంకుడోతు నాగునాయక్(33), లలిత దంపతులు ప్రతి రోజూ సూర్యాపేటకు వచ్చి సుతారీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం వర్షం రావడంతో పనికివెళ్లలేదు. అయితే ఇంటి ముందున్న నల్లాగుంట వర్షపు నీటితో నిండటంతో ఇంట్లో ఉన్న విద్యుత్‌మోటార్‌తో నీటిని ఎత్తిపోస్తున్నారు. ప్రమాదవశాత్తు మోటార్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై నాగునాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. నాగునాయక్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

వదిలిన వలకు చిక్కి మత్స్యకారుడు ...



నర్సయ్య (ఫైల్)

మోతె, ఆగస్టు 6: చేపల వేటకు వెళ్లి వలలో చిక్కి మత్స్య కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా మోతె మండలం సర్వారం ఆవాస గ్రామం రామునితండాలో జరిగింది. ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రావుల నర్సయ్య(50) వృత్తిరీత్యా మత్స్యకార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కూడలి చెక్ డ్యాం నుంచి నీటిప్రవాహం సర్వారం చెక్ డ్యాం వద్దకు పెరిగింది. దీంతో గ్రామస్తులు చేపలు పట్టేందుకు వలలతో చెక్ డ్యాం వద్దకు వెళ్లారు. నర్సయ్య కూడా సాయంత్రం నాలుగు గంటల సమయంలో తన వల తీసుకుని డ్యాం వద్దకు వెళ్లి వల విసిరాడు. అందులో కొన్ని చేపలు పడ్డాయి. ఆ తరువాత మరోసారి వల విసిరేందకు పాకురుపట్టిన బండ మీద నిలబడి వలను విసిరే క్రమంలో కాలు జారి డ్యాంలో పడ్డాడు. కాళ్లకు వల చుట్టుకోవడంతో బయటికి రాలేక నీటిలో మునిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత సమీపంలోని స్థానికులు గుర్తించి బయటకు తీసేలోపే మృతి చెందాడు. నర్సయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడాది కిందట కుమారుడు..

ఇదిలా ఉండగా నర్సయ్య, లక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె పెళ్లి కాగా అనారోగ్యంతో కుమారుడు(18) ఏడాది కిందట చనిపోగా, మంగళవారం వలకు చిక్కి నర్సయ్య చనిపోయాడు. ఇటు కుమారుడిని, భర్తను కోల్పోయి లక్ష్మి ఒంటరిగా మిగిలింది. నర్సయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తి అదృశ్యంపై కేసు

నిడమనూరు, జూలై 6: భార్యతో కలిసి ఫంక్షన్‌కు వచ్చిన భర్త అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురంలో జరిగింది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి(సాగర్) మండలం తిరుమలగిరి శివారు బడాయిగడ్డ గ్రామానికి చెందిన సింగం నాగేశ్వరరావు(52), ఇందిరమ్మ దంపతులు. నాగేశ్వరరావు వ్యాపారం చేస్తుండగా, భార్య ఇందిరమ్మ టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దంపతులు ఈ నెల 5న నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామంలోని బంధువుల శుభకార్యానికి హాజరయ్యారు. బట్టలు మార్చుకుని ఇప్పుడే వస్తానని భార్యకు చెప్పి నాగేశ్వరరావు బయటకు వెళ్లాడు. కానీ ఎంతకూ రాకపోడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా భర్త ఆచూకీ లభించలేదు. దీంతో భర్త కనిపించడం లేదని ఇందిరమ్మ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గాయపరిచిన వ్యక్తిపై ..

చిట్యాలరూరల్, ఆగస్టు 6: దాడి చేసిన గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్ఐ ధర్మ తెలిపారు. మండలంలోని పిట్టంపల్లి శివారులో మెట్టు చంద్రయ్యకు చెందిన పొలంలో సైదులు గొర్రెలు మేపుతున్నాడు. తన అనుమతి లేకుండా ఎందుకు మేపుతున్నావని చంద్రయ్య ప్రశ్నించగా సైదులు కర్రతో దాడి చేసి గాయపరిచాడు. చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఉద్యమానికి ఊపిరి పోసిన జయశంకర్



నల్లగొండలోని జయశంకర్ విగ్రహానికి పూల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నల్లగొండలోని మాట్లాడుతున్న ఏఎస్పీ రాములునాయక్

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని వివిధ పార్టీల నాయకులు కొనియాడారు. జయశంకర్ జయంతిని మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని జయశంకర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. జయంతిని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మర బోయిన కేశవులు, కర్నాటి యాదగిరి, శ్రీనివాస్, మెండు అఖిల్‌రెడ్డి, ఎస్.రాజేంద్రప్రసాద్, శ్రీహరి పాల్గొన్నారు. డిండిలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్య క్రమంలో ఎంపీడీవో డానియెల్, లక్ష్మయ్య, శివనందం, పురుషోత్తం పాల్గొన్నా రు. కట్టంగూరులోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, ఆర్ఐ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ చలపతి, ఏపీవో రాంమోహన్ పాల్గొన్నారు. మిర్యాలగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి జయశంకర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. తొలి, మలిదశ ఉద్యమాల వారధిగా జయశంకర్ కీలక పా త్ర పోషించారన్నారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ నిధులు, నీళ్లు, నియామకాలు ఎజెండాగా తీసుకుని అన్నివర్గాల ప్రజలను ఉద్యమంలోకి రప్పించారన్నారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, కార్పెంటర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగార్జునాచారి, కొండోజు మల్లిఖార్జునాచారి, గడగోజు శేఖర్, రాజు, కౌన్సిలర్లు రవినాయక్, రుణాల్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, గంధం రామకృష్ణ, ముదిరెడ్డి నర్సిరెడ్డి పాల్గొన్నారు. మిర్యాలగూడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, యడవెళ్లి శ్రీనివాసరెడ్డి, అన్నభీమోజు నాగార్జునాచారి, జొన్నలగడ్డ రంగారెడ్డి, మోసిన్‌అలీ పాల్గొన్నారు. శాలిగౌరారంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి, సూపరింటెండెంట్ గాదరి సుందరయ్య, ఎంపీవో పద్మ, ఏపీవో జంగమ్మ, పాల్గొన్నారు. తిరుమలగిరిసాగర్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కట్టంగూరులో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జయశంకర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జయశంకర్ జయంతి నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఏవో శ్రీనివాసులు పాల్గొన్నారు. అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌లో జరిగిన కార్యక్రమంలో కమాండెంట్ సత్యశ్రీనివాస్, అడిషనల్ కమాండెంట్లు కేవీ. రవిచంద్ర, సీహెచ్. ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అడవిదేవులపల్లి, ఆగస్టు 6: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లను పరిశీలించి వాటిని శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, ఎంపీడీవో కరుణాకర్‌రావు, ఎంపీవో మోసిన్‌అహ్మద్, హెచ్ఎం వరలక్ష్మీ, స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏపీవో సూర్యనాయక్, మెడికల్ ఆఫీసర్ హజరత్ మహమ్మద్, ఏపీఎం శేషయ్య పాల్గొన్నారు.

దేవరకొండ: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని వద్యతండా మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరాములు, ఇన్‌చార్జి ఎంపీడీవో నీలిమా, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ ఎంపీపీ జాన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో రాంరెడ్డి, దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ టి. రమేష్‌బాబు కోరారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ ప్రాంగణంలో చెత్తా చెదారం తొలగించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, పస్నూరి యుగంధర్‌రెడ్డి, ఈవో డాకునాయక్ పాల్గొన్నారు.

డిండి: అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో డానియెల్ సూచించారు. డిండిలో జాతీయ రహదారిపై ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు. పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జంగయ్య ఉన్నారు.

మునుగోడు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రజలకు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరిపినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

హాలియా: పరిశుభ్రమైన నీటిని వినియోగించుకోవాలని డీఈవో బొల్లారం బిక్షపతి అన్నారు. అనుముల ఎంపీడీవో సుజాతతో రామడుగు ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం కట్టమధుసూదన్, మద్దెల ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ అరుణ, ఉప్పరి జీవిత, వీవోఏ సైదులు, ఫీల్డ్ అసిస్టెంట్ అండాలు, కోటయ్య పాల్గొన్నారు. హాలియా మున్సిపాలిటీలో కమిషనర్ మున్వర్ అలీ మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించారు.



హాలియాలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న డీఈవో భిక్షపతి

కేతేపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. కేతేపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డి.నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎన్. మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి. నాగేశ్వరరావు, ఏవో బి.పురుషోత్తం, డాక్టర్ అర్చన కొంద్ర పాల్గొన్నారు.

రామగిరి: నల్లగొండ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమని మునిసిపల్ కమిషనర్ సయద్య ముసాబ్‌అలీ అన్నారు. పట్టణంలోని వల్లభరావు చెరువు, పాతబస్తీ వంటి ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఏఈ దిలీప్ భార్గవ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

కట్టంగూరు: పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, నాయకులు మాద యాదగిరి, పెద్ది సుక్కయ్య, సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, చెరుకు యాదగిరి, చెరుకు సైదులు, మిట్టపల్లి శివశంకర్, ముత్తిలింగం, ముక్కమాల శేఖర్, గట్టిగొర్ల సత్తయ్య పాల్గొన్నారు.

చింతపల్లి: స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని తీదేడు గ్రామశివారులోని డంపింగ్ యార్డు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరాములు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలి

చిట్యాల, ఆగస్టు 6: డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పథకం పూర్తయితే దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు సాగు, తాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు. డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి నిధులు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 9న నల్లగొండలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొంతల చంద్రారెడ్డి, తుమ్మల వీరారెడ్డి, కత్తుల లింగస్వామి, బండ శ్రీశైలం, జిట్ట నగేష్, శంకరయ్య, జిట్ట సరోజ మల్లం మహేష్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

వేములపల్లి, ఆగస్టు 6: తల్లిపాలు బిడ్డకు అమృతం సీడీపీవో చంద్రకళ అన్నారు. తల్లిపాల వారోత్సవంలో భాగంగా మండలంలోని ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రం-2లో మంగళవారం నిర్వహించిన తల్లిపాల ప్రాముఖ్యత అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు తాపిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజిని, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఝాన్సీ అంగన్‌వాడీ టీచర్లు సుభద్ర, యాదమ్మ, విమల, ఆయా జలేంద్ర పాల్గొన్నారు.

మునుగోడు: మండలంలోని ఊకొండి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భద్రయ్య, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ఎన్. సుమలత, జె లింగమ్మ, ఉమారాణి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దామరచర్ల, ఆగస్టు 6: గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఎంపీడీవోకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వాడపల్లి రాములు, జైరుద్దిన్, మార్క్ ఉన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు అర్థరహితం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 6: రుణమాఫీపై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేసిన విమర్శలు అర్థరహితమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య అన్నారు. నార్కట్‌పల్లిలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో నాలుగు విడతలుగా చేసిన రూ.లక్ష వడ్డీ కిందనే బ్యాంకులు జమ చేసుకున్నాయన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు రూ.2లక్షల రుణమాఫీని చేస్తుందని హర్షించాల్సింది పోయి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచి అభివృద్ధి నెపంతో స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారిన చిరుమర్తి లింగయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి ప్రాజెక్టును పూర్తిచేయకుండా అంచనా బడ్జెట్ పెరగడానికి కారణం మీరు కాదా అని ప్రశ్నించారు. మోటార్లను ట్రయల్ రన్ చేసి నెత్తిన నీళ్లు చల్లుకున్నంత మాత్రాన బి.వెల్లెంల రిజర్వాయర్‌ను నింపినట్టా అని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, కొంపెల్లి సైదులు, ఐతరాజు యాదయ్య, జెరిపోతుల భరత్, రాధారపు బిక్షపతి, ప్రజ్ఞాపురం సత్తి, చల్లా వాసుదేవ్, దూదిమెట్ల వెంకన్న పాల్గొన్నారు.

నకిరేకల్ ముత్యాలమ్మ గుడి చైర్మన్‌గా యోగానందం



నకిరేకల్, ఆగస్టు 6: నకిరేకల్ పట్టణం తాటికల్ రోడ్డులోని ముత్యాలమ్మ దేవాలయం చైర్మన్‌గా నకిరేకల్‌కు చెందిన గంగాధర యోగానందం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఈ నెల 15వ తేదీన ముత్యాల మ్మ బోనాల పండుగను నిర్వహించాలని కమిటీ తీర్మానించిందని తెలిపారు. పెద్దసంఖ్యలో ప్రజలు, భక్తులు హాజరుకావాలని కోరారు. తన నియామకానికి సహకరించిన మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణికృష్ణమూర్తికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గద్దర్ జీవితమంతా పోరుబాటే

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: ప్రజాగాయకుడు, విప్లవ కవి గద్దర్ తన జీవిత కాలమంతా పోరుబాటలో నడిచారని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అన్నారు. గద్దర్ ప్రథమ వర్ధంతిని జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. చండూరులోని అమరుల వీరుల స్థూపం వద్ద మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ, వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్‌యాదవ్, మునిసిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఈ నాగప్రసాద్, సీఐ వెంకటయ్య, ఎస్ఐ వెంకన్న, నాగరాజు, ప్రవీణ్‌రెడ్డి, రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు తోకల వెంకన్న, కోడి వెంకన్న, అన్నెపర్తి శేఖర్, కొన్రెడ్డి యాదయ్య, అనంత మంగమ్మగిరిధర్, కీర్తి సంజయ్, గుంటి వెంకటేశం, కోడి గిరిబాబు పాల్గొన్నారు. నాంపల్లిలో గద్దర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిర్యాలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గద్దర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. గద్దర్ పాటే దోపిడీపై గురిపెట్టిన తూటా లాంటిదని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు దేశిడి శేఖర్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, బెజ్జం సాయి పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గద్దర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలి, చీర పంకజ్‌యాదవ్, మాలే శరణ్యారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రెగట్టే మల్లిఖార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీం పాషా, మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్, సింగం రామ్మోహన్, బక్క పిచ్చయ్య, కాంచనపల్లి రవీందర్‌రావు, గోకికర్ జవహర్, బోనగిరి దేవేందర్ పాల్గొన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, బకరం శ్రీనివాస్, మానుపాటి బిక్షమయ్య, మల్ల యాదయ్య, నర్సింగ్ హర్షవర్ధన్, హరి, రమేష్ పాల్గొన్నారు. మును గోడులో గద్దర్ చిత్రపటానికి పలు ప్రజాసంఘాలు, కళాకారులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారులు వనం లింగయ్య, రడం నర్సింగ్‌రావు, జీడిమెట్ల రవీందర్, శివరాత్రి రాములు, మేడి సైదులు, యాదన్న, గంట నాగేష్, మేకల అశోక్, నాగరాజు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

దేవరకొండ, ఆగస్టు 6: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మెనిఫెస్టోలో ఇచ్చిన ఎస్సీ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండలో తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8నెలలు అవుతున్నా ఇప్పటివరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అంకూరి నర్సింహ, ఎర్ర బిక్షపతి వస్కుల సుధాకర్, గుండాల అంజయ్య యాదవ్, సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి : ఎమ్మెల్యే

చండూరు, ఆగస్టు 6: రాజకీయాలకు అతీతంగా చండూరు పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. 10లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచి నీటి సరఫరా భాండాగారాల నిర్మాణాలకు మంగళవారం చండూరులో శంకుస్థాపన చేశారు. రాజకీయాల్లోకి వచ్చింది ప్రజల సంక్షేమం కోసమేనన్నారు. పట్టణంలో చేనేత కార్మికులు, కంచర వృత్తిపై ఆధారపడిన వారు ఆర్థికంగా ఎక్కువ మంది చతికిల పడినవారు ఉన్నారని వారిని ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానన్నారు. పట్టణ రోడ్డు విస్తరణ పనులకు వ్యాపారస్తులు, దుకాణాదారులు సహకరించాలన్నారు. పట్టణ అభివృద్ధి విషయంలో ఆలస్యమైనందుకు తనను క్షమించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పట్టణంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లించకపోవడంతో అర్థాంతరంగా పనులు నిలిచిపోయాయన్నారు.

మునుగోడు: మానసిక ప్రశాంతతకు దోహదపడే ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక శివరామక్షేత్రంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పనుల్లో తీరిక లేకుండా ఉంటున్న ప్రస్తుత రోజుల్లో కొంత సమయం ఆధ్యాత్మికతకు సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, చెరుపల్లి వెంకటేశం, బొడ్డు యాదయ్య, జిట్టగోని యాదయ్య, సైదులు పాల్గొన్నారు.

మర్రిగూడ: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. నాంపల్లి మండలంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో స్వయంగా డ్రైనేజీలో చెత్త చెదారాన్ని తొలగించారు. నాంపల్లి మండల కేంద్రం నుంచి బంగారుగడ్డ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల నాణ్యత విషయంలో రాజీపడవద్దని కాంట్రాక్టర్లతో అన్నారు. తిరుగండ్లపల్లి గ్రామంలో రూ.3.2కోట్ల వ్యయంతో నిర్మాణం చేసుకున్న 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను, ముష్టిపల్లిలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. శివన్నగూడెంలో రేషన్ షాపు దుకాణం, అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండికోట రాజమణి హరికృష్ణ, రాందాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, వెంకటంపేట బాలయ్య, రవీందర్‌రావు, చిట్యాల రంగారెడ్డి, నీలిమా చంద్రశేఖర్ ఉన్నారు. బెల్ట్‌షాపులతో ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ముష్టిపల్లిలో సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఓ మహిళ బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యేకు మొర పెట్టుకో వడంతో గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణపై, ఎక్సైజ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



చండూరులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

కొండమల్లేపల్లి: ఆర్‌బీఐ, సీఎఫ్ఎల్ సంస్థల ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అప్రమత్తత అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంకులమ్మ, ఉషారాణి, సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో యువమోర్చా మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుందేళ్ల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా గజ్జే అభినవ్‌ను నియమించారు. కార్యక్రమంలో నాయకులు శివర్ల రమేష్‌యాదవ్, చెనమోని రాములు కుక్కడపు రామ కృష్ణ, వెన్నం శేఖర్, గొడ్డటి మధు, బొడ్డు మహేష్, మోర వెంకటరమణ, రాపర్తి సతీష్, కువంభం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని కుర్మేడ్‌కు చెందిన సురిగి శేఖర్‌ను నల్లగొండ జిల్లా ఫొటోగ్రాఫర్ యూనియన్ సహాయక కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ తెలిపారు.

రామగిరి: బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణాధ్యక్షుడిగా నల్లగొండ పట్టణానికి చెందిన బీపంగి వినోద్ కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు కంకణాల నాగిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు నాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చందంపేట: మండలంలోని పాత కంభాలపల్లిలో మోహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్లను ఊరేగింపు నిర్వహించి భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ బలేమియా, షేక్ ఉస్మాన్, ఖాదర్‌పాష, ఉస్మాన్, నజీర్, నిరంజన్ పాల్గొన్నారు.

దేవరకొండ: రైతుసంఘం మండల అధ్యక్షుడుగా హనుమాండ్ల కేశవులు, కార్యదర్శిగా తిప్పర్తి విజేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. రైతు సమస్యలపై ఉద్యమాలు చేస్తామన్నారు. డిండి ప్రాజెక్టును కల్వకుర్తి ఎత్తిపోతల నీటితో నింపి ఆయకట్టులో నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నార్కట్‌పల్లి: మండలంలోని చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన కోలాటం బృందానికి చిప్పలపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు బండ సాగర్‌రెడ్డి భజన చిడతలు, మద్దెలు బహూకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి రాజు, శ్రీనివాస్‌రెడ్డి, వర్రె మల్లయ్య, నరసింహ, రాంబాబు, రాజమల్లు, బిక్షమయ్య, వంగాల శ్రీను ఉన్నారు.

నార్కట్‌పల్లి: సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో

సంక్షిప్త సమాచారం..

నార్కట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన కల్పించారు. సంస్థ ప్రతినిధి కొమగిరి సహదేవ్ మాట్లాడుతూ విద్యారంగంలో నూతన అధ్యయనం కోసం రోబోటిక్స్ యొక్క ఆవశ్యకత, సృజనాత్మకతమైన ఆలోచన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడం కోసమే ఈ శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాములు, సంస్థ ప్రతినిధులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలనే డిమాండ్‌తో బీజేపీ ఎస్సీ మోర్చా మండల శాఖ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఏర్పుల లింగస్వామి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేశ్, మల్లెబోయిన రమేశ్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, ధనుంజయ్య, సత్తయ్య ఉన్నారు.

దేవరకొండ: నకిరేకల్‌లో జూలై నెలలో జరిగిన 38వ షోటోకాన్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ తరుపున గెలుపొందిన విజేతలను దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, భాస్కర్‌రెడ్డి, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎనమనేని రవీందర్‌రావు, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మర్రిగూడ మాజీ సర్పంచ్ మాస నీలిమా చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, పంతంగి సుధాకర్ పాల్గొన్నారు.

హాలియా: హాలియా మున్సిపాలిటీలోని హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి అడ్డుగా ఉన్న 11 కేవీ కరెంట్ లైన్లను కౌన్సిలర్ గౌని సుధారాణిరాజారమేష్‌యాదవ్ మంగళవారం తొలగించారు. ఆలయ ఆవరణంలో మొత్తం శుభ్రం చేసి ఆలయ పునర్నిర్మాణానికి అడ్డుగా ఉన్న లైన్లను తొలగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రావు, కాంట్రాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సెక్రటరీ వర్కాల సుధాకర్‌రెడ్డి, కాకునూరి చిననారాయణ తదితరులు పాల్గొన్నారు.

చండూరు: చండూరు ఎస్ఐగా ఎన్. వెంకన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ సురేష్ నల్లగొండ వన్ టౌన్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు.

హాలియా: ఐఐఐటీలో హాలియాకు చెందిన గోపిశెట్టి సైదులు కుమార్తె గోపిశెట్టి శివాని బాసరలో సీటు సాధించింది. బాసర ఐఐఐటీలో స్పోర్ట్స్ కోటా నుండి సీట్ సాధించింది.

నార్కట్‌పల్లి: నకిరేకల్‌లో ఈనెల 4న జరిగిన 38వ షాటోకాన్ కరాటే నేషనల్ చాంపియన్ షిప్-2024 పోటీల్లో నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతీబా పూలే బాలుర గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వివిధ కేటగిరీల్లో కలిపి మొత్తం 19 పతకాలు సాధించారు. వీటిలో 7 బంగారు, 5 వెండి, 3 కాంస్య పతకాలు సాధించారు. వీరికి ఎమ్మెల్యే వేముల వీరేశం బహుమతులు అందజేశారు.

శాలిగౌరారం: తెలంగాణ యువజన సంఘం తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని ఉట్కూర్‌కు చెందిన కట్లకుంట్ల అనిల్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు పోర్ల విప్లవ్‌కుమార్ మంగళవారం కట్లకుంట్ల అనిల్‌కు నియామకం పత్రం అందజేశారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శ్రావణమాసం మొదటి మంగళవారం పురస్కరించుకుని భక్తులకు శ్రీమంగళగౌరి దేవిగా దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీరసారె ఒడిబియ్యం సమర్పించుకున్నారు.



పోడు భూములు కాపాడాలి : ఎమ్మెల్యే బాలు



చింతపల్లిలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 6: నియోజకవర్గంలో పోడు భూములు సంరక్షించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో అటవీశాఖ అధికారుల సమావేశంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఏళ్ల తరబడి పోడుభూములు సాగు చేసుకుంటున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులులేవని, నిబంధనలకు విరుద్ధంగా భూములు విక్రయించుకుంటే చర్యలు తీసుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోడు భూముల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, పోడు భూములపై నివేదిక ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్, డివిజన్ ఫారెస్ట్ అధికారి సంగీత, బిక్షం, భాస్కర్, శ్రీధర్, రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. 109 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, కాయతి జితేందర్ రెడ్డి, ముచ్చర్ల యాదగిరి, దాసరి శ్రీనివాస్‌యాదవ్, దొంతం సంజీవరెడ్డి, దోటి రెడ్డి, హరినాయక్, కిన్నెర హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో సత్తా చాటాలి

కనగల్, ఆగస్టు 6: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని నల్లగొండ బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ పిల్లి రామరాజుయాదవ్ అన్నారు. కనగల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పులకరం బిక్షం మిర్యాల వెంకటేశం, తిరందాసు కనకయ్య, భూపాల్‌రెడ్డి, దాసరి వెంకన్న, బైరగోని అశోక్, పంతంగి సైదులు, పాపిరెడ్డి, ఒర్సు శ్రీను తదితరులు ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కేతేపల్లి, ఆగస్టు 6: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 48మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం మండలకేంద్రంలో అందజేశారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలకు అర్థం లేదన్నారు. జిల్లాలో సరైన వర్షాలు కురవక చెరువులు, కుంటలకు నీరు చేరలేదన్నారు. ఈ క్రమంలో అందుబాటులోకి వస్తున్న ఏఎమ్మార్పీ నీటితో మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు నింపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డి. నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎన్. మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి. నాగేశ్వరరావు, ఏవో బి. పురుషోత్తం, ఎంపీవో నాగలక్ష్మి, కె. శ్రీనివాసయాదవ్, బిసుందర్, జి.మాధవరెడ్డి, మట్టి సాల్మన్, కోట వెంకటేశ్వరరావు, బీరం జాన్‌రెడ్డి పాల్గొన్నారు.



కేతేపల్లిలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం